# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక


సంచిక : 39 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మే | శుక్రవారం | 9-5-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో **(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
& **చైతన్య గళం** ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.


## ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

- ఇది కొనసాగుతుందని ప్రకటించిన కేంద్రం
- అఖిలపక్ష భేటీలో వివరాలు వెల్లడించిన రాజ్‌నాథ్
- దేశ రక్షణలో రాజీపడబోమని వెల్లడి
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన విపక్ష నేతలు

**న్యూఢిల్లీ, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం ఉదయం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆపరేషన్ సిందూర్ విజయం, పర్యవసానాలను ఆయన వివరించారు. సిందూర్ అనేది కొనసాగుతున్న ఆపరేషన్ అని అన్నారు. భారత్ మరిన్ని దాడులు చేయాల్సిన అవసరం లేదని, కానీ పాక్ దళాలు దాడిచేస్తే తిరిగి ఎదురు దాడి చేస్తామని అన్నారు. కేంద్ర మంత్రులు

-మిగతా 2 లో

## భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న పాక్

### లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం



పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

- పాక్ రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు
- భారత్‌లో పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు
- సమర్థంగా తిప్పికొట్టిన రోణ దళాలు
- ఆయా ప్రాంతాల్లో డ్రోన్ శకలాల సేకరణలో అధికారులు

**న్యూఢిల్లీ, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు-

-మిగతా 2 లో







## జిహాద్ పేరుతో హత్యలు చేస్తారా

- ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తారా
- పాక్ ఘాతుకాలపై మండిపడ్డ ఓవైసీ

**న్యూఢిల్లీ, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** భారతదేశంపై జిహాద్ పేరిట హత్యలు చేయాలని పాకిస్తాన్ మద్దతుతో ఉన్న ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మరోసారి ఉగ్రవాదంపై ఘాటు వ్యాఖ్యలు చేసారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడికి

-మిగతా 2 లో



## మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

- వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు
- ఖమ్మంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న నలుగురు మంత్రులు

**ఖమ్మం, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి

-మిగతా 2 లో

## భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడాల్సిందే




- ఉగ్రవాదాన్ని ఎగదోస్తే.. మీకు నూకలు చెల్లినట్లే
- దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తే తాటతీస్తాం
- ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా ర్యాలీలో సీఎం రేవంత్

**హైదరాబాద్, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని దయాది దేశం పాకిస్థాన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో

-మిగతా 2 లో



## 14మంది పాక్ జవాన్ల దుర్మరణం

### ఐఈడి పేలుడుతో బలూచీలో వరుస దాడులు

**ఇస్లామాబాద్, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్** బీఎల్‌ఏ వరుస దాడులతో పాక్ ఆర్మీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పాక్ ఆర్మీ వాహనంపై బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడి చేసింది. ఐఈడీ బాంబులతో పాక్ ఆర్మీ వాహనాన్ని పేల్చివేసింది. మాచ్‌కుండ్ ప్రాంతంలో బీఎల్‌ఏ దళాలు

-మిగతా 2 లో



## మద్యం స్కామ్ కేసులో నిందితులకు షాక్

- ధనుంజయ్ రెడ్డి తదితరులకు బెయిల్ తిరస్కరణ
- విచారణ ఈ నెల 13కు వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** ఏపీ లిక్కర్ స్కాంలో నిందితులకు సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసులో నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ ముగ్గురికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. ఈ కేసులో వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ నిందితులు

-మిగతా 2 లో

## ఉగ్రవాదులు లక్ష్యంగానే భారత్ దాడులు



- పౌరులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా
- శవపేటికలపై పాక్ జెండాలు కప్పడంలో అర్థం ఏమిటో
- పాకిస్థాన్‌లో ఇలాంటి ఆచారం ఉందేమో
- గతంలో దాడులకు సంబంధించిన వివరాలు ఎన్నో ఇచ్చాం
- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి

**న్యూఢిల్లీ,** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక దాడుల్లో కేవలం ఉగ్రవాదులను మాత్రమే హతమార్చినట్లు- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పౌరులు చనిపోయారన్న పాకిస్థాన్ ఆరోపణలను ఆయన

-మిగతా 2 లో

## లాహోర్ ను వీడండి

### తమ పౌరులకు అమెరికా హెచ్చరికలు




**న్యూఢిల్లీ, మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఒకరిపై ఒకరు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా అప్రమత్తమైంది. ఈ మేరకు పాక్‌లోని తమ పౌరులు, దౌత్యవేత్తలను అప్రమత్తం చేసింది. వెంటనే లాహోర్ ను వీడి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని ఆదేశించింది. ఈ మేరకు

-మిగతా 2 లో

# ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

(మొదటి తరువాయి)

రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, ఎస్.జయశంకర్, జె.పి.నడ్డా, నిర్మలా సీతారామన్ ప్రభుత్వం తరపున హాజరవగా, కాంగ్రెస్ నుండి లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టిఎంసి నుండి సందీప్ బందోపాధ్యాయ, డిఎంకె నుండి టి.ఆర్.బాలులు సమావేశానికి హాజరయ్యారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. దేశభద్రతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు. మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం. దీనర్థం ఎవరైనా మా ఓపికను దుర్వినియోగం చేయవచ్చని కాదు. మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఊహించని కచ్చితత్వంతో అమలు చేశాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయని, ఇందులో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సాయుధ బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శించాయని ప్రశంసించారు. సామాన్యులకు ఎటు-వంటి నష్టం వాటిల్లకుండా ఈ ఆపరేషన్ చేపట్టామని, అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పనితీరువల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాన్ని అఖిలక్షం సమర్థించింది. సైన్యానికి బాసటగా ఉంటామని రాహుల్ తదితరులు ప్రకటించారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అప్పుడే ముగిసిపోలేదని కేంద్రం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదని, ఇంకా కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే భద్రతా కారణాల రీత్య ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను బయటపెట్టలేమని అన్నారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ అసత్య ప్రచారం చేస్తోందని, ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కిరణ్ రిజిజు చెప్పారు.

# భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న పాక్

(మొదటి తరువాయి)

భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు- విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మోర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు-, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు- పాకిస్థాన్ ప్రకటించింది.

# భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడాల్సిందే

(మొదటి తరువాయి)

భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు- పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తి నిచ్చేందుకే ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టినట్లు- ఆయన వివరించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే వారికి నూకలు చెల్లినట్లేనని.. ఇది మా హెచ్చరిక అంటూ సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతామని ఆయన తెలిపారు. మేం శాంతి కాముకులమని ఆయన పేర్కొన్నారు. అది మా చేతగానితనం అనుకుని మా ఆడబిడ్డల నుదిటి సిందూరం తుడిచేయాలనుకుంటే.. వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా సమాధానం చెబుతామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉగ్రమూకలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని.. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి అని అన్నారు. బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు- పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి అమరుడయ్యారు మహాత్ముడు. ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈరోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నాం. ఆయన శాంతి సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్న భారతీయులు శాంతిని కోరుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే దిశగా కొనసాగుతున్నారు. మా శాంతి ఆకాంక్షను చేతగానితనంగా భావించి ఎవరైనా మా భూభాగంలో కాలుమోపి.. మా ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేయాలని అనుకుంటే.. ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం. ఆపరేషన్ సిందూర్ ద్వారానే మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి మా వీర జవాన్లకు ఉంది. ఆ వీర జవాన్‌లకు 140 కోట్ల భారతీయులు అండగా నిలబడతారని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇవ్వదలచుకున్నాం అని రేవంత్ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగి

## ఉగ్రవాదులు లక్ష్యంగానే భారత్ దాడులు

(మొదటి తరువాయి)

ఖండించారు. భారత సైనిక దాడుల్లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు హాజరైన చిత్రాన్ని విక్రమ్ మిస్రీ ప్రదర్శించారు. శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి ప్రభుత్వ లాంఛనాలతో పౌరులకు అంత్యక్రియలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. మే 7న భారత్ జరిపిన సైనిక దాడులన్నీ జాగ్రత్తగా ఎంచుకున్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాద లక్ష్యాలపైనే అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. 'ఈ దాడుల్లో ఎవరైనా పౌరులు చనిపోతే, ఈ చిత్రం మీ అందరికీ ఎలాంటి సందేశాన్ని పంపుతుందో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది అడగాల్సిన ప్రశ్న. పౌరుల అంత్యక్రియల్లో శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి, ప్రభుత్వ గౌరవం ఇవ్వడం కూడా వింతగా ఉంది. హతమైన వ్యక్తులు ఉగ్రవాదులే. అలాంటి ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు బహుశా పాకిస్థాన్‌లో ఒక ఆచారం కావచ్చు. ఇది మాకు పెద్దగా అర్థం కాలేదు' అని అన్నారు. అలాగే మతపరమైన ప్రదేశాలపై భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్ ఆరోపణలను కూడా విక్రమ్ మిస్రి ఖండించారు. ఇది పూర్తిగా అబద్ధమని అన్నారు. కేవలం ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు సాగాయని అన్నారు. ఇకపోతే పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టామన్నారు. ఈ పాక్ సైన్యం కాల్పుల్లో 16 మంది మృతి చెందినట్లు తెలిపారు. పహల్గామ్ దాడులకు పాల్పడింది తామేనని ఆర్‌టిఎ ప్రకటించిందని, అది లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ అని తెలిపారు. అయితే, అంతర్జాతీయ సమాజానికి పాక్ తప్పుడు సమాచారం ఇస్తోందన్నారు. ఉగ్రవాదులతో తమక సంబంధాలు లేవని పాక్ బుకాయిస్తోందన్నారు. పాక్‌లో టెర్రరిస్టులు లేరని ఆ దేశ మంత్రి నిస్సిగ్గుగా చెబుతున్నారని.. అనేక దాడుల్లో పాక్ ప్రమేయం ఉందని చాలా సార్లు రుజువైందని వివరించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదే పాకిస్తాన్ అన్నారు.

## మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

(మొదటి తరువాయి)

విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు- ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు- ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు.

# జిహాద్ పేరుతో హత్యలు చేస్తారా

(మొదటి తరువాయి)

బాధ్యత వహించిన లష్కరే తోయిబాకి అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ పై అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఇకపోతే, భారత వైమానిక దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై ఎయిర్÷-టస్ట్రైక్స్ నిర్వహించిన మరుసటి రోజు గురువారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అన్ని పార్టీల సమావేశంలో ఓవైసీ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా నిర్వహించిన భారత సాయుధ దళాలకు, ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. అలాగే టిఆర్ఎఫ్‌పై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రచారం ప్రారంభించాలని, అమెరికా కూడా దీన్ని విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరిలో హాఫీజ్ అబ్దుర్ రౌఫ్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 'ఈ ఏడాది జిహాద్ చేయాలి' అని అన్నారని ఆయన గుర్తు చేసారు. 'జిహాద్' పేరిట భారతదేశంలో హత్యలు, భయోత్పాతం సృష్టించడమే వారి లక్ష్యమని, పాకిస్తాన్‌ను ఉగ్ర లిస్ట్ లో చేర్చాలని ఆయన కోరారు. అలాగేప్రభుత్వం కూడా ఉగ్రసంస్థను నిషేధించి పాకిస్తాన్‌పై ఆంక్షలు విధించాలని ఓవైసీ తెలిపారు. కశ్మీరీ ప్రజలను భారత్‌కు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని, పూంఛ్‌లో పౌరులు హత్యకు గురవడం, ఉరి ప్రాంతంలో ప్రజలు తమ ఇల్లు కోల్పోవడం తీవ్ర విషాదకరం అని తెలిపారు. అలాగే ఘటనలో బాధితులను ఉగ్రవాద ఘటనల బాధితులుగా గుర్తించి, వారికి తగిన పరిహారం అందించాలని అలాగే వారి ఇళ్లను తిరిగి నిర్మించాలని.. కేంద్ర ప్రభుత్వం అందుకు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

## 14మంది పాక్ జవాన్ల దుర్మరణం

(మొదటి తరువాయి)

ఐఈడీ పేల్చాయి. ఈ దాడిలో 14 మంది పాక్ సైనికులు మృతి చెందారు. బలూచిస్థాన్‌లోని బిలాన్ పర్వత ప్రాంతంలో ఈ ఘటన జరిగింది.

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు దాడుల్లో 14 మంది పాక్ ఆర్మీ జవాన్లు హతమయ్యారు. బిలాన్‌లోని మాచ్‌లోని షోర్కాండ్ ప్రాంతంలో పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై బీఎల్ఏ రిమోట్ క్రంటోల్ ఐఈడీ దాడి చేసింది. ఈ దాడిలో 12 మంది సైనికులు మరణించారు. మరణించిన సైనికుల్లో స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ తారిక్ ఇమ్రాన్, సుబేదర్ ఉమర్ షరూక్ ఉన్నారు. ఈ పేలుడు ధాటికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఇక మరోచోట బీఎల్ఏ నిర్వహించిన రెండో దాడిలో ఇద్దరు పాక్ జవాన్లు మృతి చెందారు. కచ్‌లోని కులాగ్ టిగ్రామ్ ప్రాంతంలో పాక్ సైనికులను లక్ష్యంగా చేసుకుని ఐఈడీ పేలుడు బాంబులు అమర్చి ఇద్దరు సైనికులను హతమార్చారు. ఈ రెండు దాడులు తామే చేశామని బీఎల్ఏ ఓ ప్రకటనను కూడా విడుదల చేసింది. అంతే కాకుండా పాక్ ఆర్మీపై బీఎల్ఏ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పాకిస్థాన్ ఆర్మీని కిరాయి ముఠాగా ప్రకటనలో తెలిపింది. కాగా.. రెండు రోజుల క్రితం కూడా బలూచిస్థానలో జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు పాక్ ఆర్మీ ప్రాణాలు కోల్పోయారు. కచ్ జిల్లాలోని మాచ్ ప్రాంతంలో పాక్ ఆర్మీ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఐఈడీతో పేల్చేశారు. ఈ పేలుళ్లో ఏడుగురు పాక్ సైన్యం

మృతి చెందారు. అయితే ఈ దాడికి పాల్పడింది బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఉగ్రవాదులుగా పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది. మరోవైపు పాకిస్థాన్‌లోని లాహోర్‌లో వరుస పేలుళ్లు జరిగాయి. లాహోర్ వాల్టన్ రోడ్‌లోని సైనిక విమానాశ్రయం వెలుపల మూడు పేలుళ్లు సంభవించాయి. పేలుళ్లను పాకిస్థాన్ అధికారులు ధృవీకరించారు. అయితే పేలుళ్ల నష్టంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ పేలుళ్లతో ముందస్తు చర్యల్లో భాగంగా లాహోర్ ఎయిర్‌పోర్టును మూసివేశారు. ఒక్కసారిగా పేలుళ్లు సంభవించడతో జనం భయంతో అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు.

# లాహోర్ ను వీడండి

(మొదటి తరువాయి)

లాహెూర్‌లోని యూఎస్ ఎంబసీ సూచనలు జారీ చేసింది.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా కొనసాగుతోంది. మంగళవారం రాత్రి ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేసిన భారత సైన్యం.. తాజాగా పాక్‌లోని కీలక నగరాలపై దాడి చేస్తోంది. లాహెూర్, సియాల్‌కోట్, కరాచీ, ఇస్లామాబాద్, రావల్పిండి వంటి ప్రధాన నగరాలపై డ్రోన్లతో విరుచుకుపతోంది. భారత్ దాడుల్లో పాక్ గగనతల రక్షణ వ్యవస్థలు ఇప్పటికే ధ్వంసం అయ్యాయి. ఇప్పటి వరకూ రూ.1600 కోట్ల విలువైన ఆస్తులను భారత్ ధ్వంసం చేసినట్లు సమాచారం.

## మద్యం స్కామ్ కేసులో నిందితులకు షాక్

(మొదటి తరువాయి)

సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ ముగ్గురికి మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. ఈ కేసు మొదలైనప్పుడే ఈ ముగ్గురు కూడా ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు వచ్చారు. అయితే దీనికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. అక్కడ న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఇక్కడకు రావాలని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ పార్థివాలా, జస్టిస్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు చేసింది. ఈ క్రమంలో బుధవారం ఈ ముగ్గురు నిందితులు వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణకు వచ్చింది. కానీ వీరికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. దాంతో ఈరోజు సుప్రీం కోర్టు ముందుకు వచ్చిన ముగ్గురు నిందితులు.. హైకోర్టు నిరాకరించినందుకు తమకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని వినతి చేశారు. ఏపీ హైకోర్టులో వీరికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించినందున.. హైకోర్టులో పెండింగ్‌లో ఉండగానే సుప్రీంలో దాఖలైన ఈ పిటిషన్ నిరర్ధకమైందని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో గతంలో వేసిన పిటిషన్‌ను సవరణ అయినా చేయాలి లేదా కొత్త పిటిషన్ అన్నా దాఖలు చేయాలని.. అంతవరకు దీనిని అనుమతించవద్దని ముకుల్ రోహత్గీ చెప్పారు. రోహత్గీ వాదనలతో ఏకభవించిన కోర్టు.. గతంలో వేసిన పిటిషన్‌ను సవరించి మరో పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. అయితే 13 వరకు తమను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని ముగ్గురి తరపున వాదించిన న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు.

## 2025 మే 9, శుక్రవారం తెలుగు పంచాంగం



మాసం- పక్షం
మాసం: వైశాఖమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
తిథి
ద్వాదశి: మే 8, మధ్యాహ్నం 12:29 నుండి మే 9, మధ్యాహ్నం 2:56 వరకు
త్రయోదశి: మే 9, మధ్యాహ్నం 2:56 నుండి మే 10, సాయంత్రం 5:30 వరకు
నక్షత్రం
హస్త: మే 8, రాత్రి 9:06 నుండి మే 10, అర్ధరాత్రి 12:09 వరకు
సూర్యోదయం - సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:50
సూర్యాస్తమయం: సాయంత్రం 6:35
చంద్రోదయం - చంద్రాస్తమయం
చంద్రోదయం: సాయంత్రం 5:39
చంద్రాస్తమయం: మే 10, తెల్లవారుజామున 4:47
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:44 - 5:24
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:47 - 12:38
అమృతకాలం: సాయంత్రం 5:23 - 7:11
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 10:37 - 12:12
యమగండం: మధ్యాహ్నం 3:23 - 4:59
దుర్ముహూర్తం:
ఉదయం 8:23 - 9:14
మధ్యాహ్నం 12:38 - 1:29
వర్జ్యం: ఉదయం 9:11 - 10:59

# చదువుతో పాటు క్రీడలు, వ్యాయామం పట్ల శ్రద్ధ పెట్టి సమతుల్యతను పాటించాలి

### -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** 2024- 25 విద్యా సంవత్సరంలో ఇటీవల 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు గురువారం ఐ.డి. ఒ.సి సమావేశ మందిరంలో అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని అందువల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించారని అభినందించారు. ముఖ్యంగా జిల్లా నుండి అమ్మాయిలు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించడం, అత్యధిక మార్కులు అమ్మాయిలే సంపాదించడం పై సంతోషాన్ని వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న 3



గిరిజన అమ్మాయిలు జేఈఈ మెయిన్ కు ఎంపిక అయ్యారని వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇప్పుడు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తమ పాఠశాలల్లో ప్రస్తుతం చదువుకున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకులనీ మండల విద్యా అధికారులు పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని సూచించారు. విద్యార్థులకు ఇది ప్రారంభం మాత్రమే అని భవిష్యత్తులో చదువుతో పాటు వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటూ చదువుతో పాటు ఆరోగ్యాన్ని సంతులనం పాటించాలని సూచించారు. ఇప్పుడు సన్మానం పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ఐ.ఐ.టి, ఎయిమ్స్ లో సీట్లు సాధించే విద్యార్థులకు తన ఇంట్లో భోజనానికి ఆహ్వానిస్తానని అన్నారు. జిల్లా నుండి ఉత్తమ మార్కులు పొందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు సైతం కలెక్టర్ చేతుల మీదుగా మొత్తం 50 మంది విద్యార్థులకు సన్మానం చేశారు. విద్యార్థులకు మెమెంటో తో పాటు వారి జీవితంలో ఉత్తేజపరిచే విధంగా ఎ.పి. జె కలాం రాసిన ఇగ్నైటెడ్ మైండ్స్ పుస్తకాని బహుకరించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ గని, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎ.అంజయ్య, ఏ. సి. జి గణేష్, మండల విద్యా అధికారులు, ప్రినిపాల్స్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన సి మణివీర్, మధులిక తేజ లకు సన్మానం

-ఘనంగా సన్మానించిన షాద్ నగర్ పట్టణ న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు
-కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కొత్త రవి
-యువత జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక ఇవ్వడం చాలా సంతోషకరం... ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి
-పట్టణానికి చెందిన ఇద్దరు ఒకేసారి జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎన్నిక కావడం షాద్ నగర్ కే గర్వకారణం
-బార్ అసోసియేషన్ షాద్ నగర్ జిల్లా కోర్ట్ ప్రెసిడెంట్ నర్వ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం కార్యక్రమం

**షాద్ నగర్, మే 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** షాద్ నగర్ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, షాద్ నగర్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మంగు మోహన్ రావు అల్లుడు సి మణి వీర్, పట్టణానికి చెందిన వ్యాపారవేత్త డాకన్నా ప్రభాకర్, అంబిక దంపతుల కుమార్తె మధులిక తేజ (సోనీ) నూతనంగా జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికవడం షాద్ నగర్ పట్టణానికే గర్వకారణమని న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు అన్నారు. నూతనంగా ఎంపికైన జూనియర్ సివిల్ జడ్జిల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రస్తుతం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కొత్త రవి హాజరయ్యారు. మణివీర్ మరియు మధులిక తేజ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనందువలన




పట్టణ న్యాయవాద బార్ అసోసియేషన్ లో సమావేశం నిర్వహించి వారిద్దరిని ప్రత్యేకంగా ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి మాట్లాడుతూ యువత న్యాయవాద వృత్తిలోకి వచ్చి కష్టపడి చదివి ఇలా జడ్జి పోస్టులకు ఎంపిక ఇవ్వడం చాలా సంతోషంగా ఉంటుందని, ఎవరికి ఏ రకమైన ప్రోత్సాహకాలు కావాలన్నా అందరం కలిసికట్టుగా అందించాలని న్యాయవాదులను కోరారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ చిన్నతనంలోనే జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక కావడం చాలా సంతోషకరమని, బాగా కష్టపడి, అత్యద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శించి, న్యాయమూర్తులుగా అందరికీ పక్షపాత వైఖరి లేకుండా న్యాయం అందించాలని, జూనియర్ సివిల్ జడ్జి నుండి మరింత ఎత్తుకు ఎదగాలని, షాద్ నగర్ పట్టణానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు చీపిరి చంద్రశేఖర్, కోశాధికారి లింగం గౌడ్, సహాయ కార్యదర్శి అంతరం నరసింహులు, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెక్రటరీ రహమత్, లైబ్రరీ సెక్రెటరీ బొమ్మ గళ్ళ రమేష్, లేడీ రిప్రజెంటేటివ్ కోటి జయమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పబ్బే శ్రీశైలం, శ్రీనివాసులు, విజయ్ కుమార్ గౌడ్, , రూప్ సింగ్, విజయ భాస్కర్ లతోపాటు న్యాయవాదులు డి నరసింహులు, శివరాములు గౌడ్, ఎం.ఎ. కరీం, కంచి రాజగోపాల్, చెంది మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పాతపల్లి కృష్ణారెడ్డి, కొట్టె గంగాధర్, కక్కునూరు వెంకటేష్ గుప్తా, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, టి. శ్రీనివాసులు మనోహర్ రెడ్డి, చెట్ల శంకర్, మద్రి శంకరయ్య, విజయ్ భాస్కర్ గౌడ్, కోరె శంకరయ్య, ఇంజమూరి నర్సింలు, శ్రీనివాసమూర్తి కానుగు మదన్మోహన్, గడ్డమీది రమేష్ కుమార్, ఎం భాస్కర్ యాదవ్, గంతల నాగరాజు ఏం నరేంద్రనాథ్, సురేందర్, గణేష్, వినీల్ కుమార్ ఆంజనేయులు గౌడ్, రాఘవేంద్ర చారి, సుండు శేఖర్ యాదవ్, లింగారం లక్ష్మయ్య, శివ కుమార్, జి సాయి చరణ్ గౌడ్, శ్రీనివాస్, అరుణ్ కుమార్ అనిల్ కుమార్, మహిళా న్యాయవాదులు లావణ్య, ప్రణయలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కు జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, మే 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)** డా" బీ. ఆర్ అంబేద్కర్ సచివాలయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే , ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ రాష్ట రవాణా మరియు బీసీ సంక్షేమం శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లేడ్ – చౌదరిగూడ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నేత కే. కే. కృష్ణ పాల్గొన్నారు.

## షాద్ నగర్ వ్యవసాయ సహాయ సంచాలకులుగా నిశాంత్ కుమార్ బాధ్యతలు



**షాద్ నగర్, మే 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)** షాద్ నగర్ వ్యవసాయ సహాయ సంచాలకులుగా (ఏడిఏ) అదనపు బాధ్యతలు స్వీకరించిన ఫరూక్ గర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్. వ్యవసాయ శాఖలో మంచి అనుభవం కలిగిన నిశాంత్ కుమార్ ఇన్చార్జి బాధ్యతలను స్వీకరించారు. ఈ స్థానంలో రెగ్యులర్ గా మరో అధికారి వచ్చేవరకు పూర్తి బాధ్యతలను మిషన్ కుమార్ సమీక్షిస్తారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ కు తోటి సిబ్బంది ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు..

## విజయవంతమైన రక్తదాన శిబిరం




**ఆమనగల్లు, మే 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మై విలేజ్ మాడల్ విలేజ్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కీర్తిశేషులు శ్రీ చింతల బాలరాజ్ గౌడ్ స్మృతితో శృతిలయ కల్చరల్ అకాడమీ మరియు సాయిరాం మెడికల్ & ఆప్టికల్స్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రి వారిచే ఆమనగల్లు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరంలో 86 మంది రక్తదాతలు రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాపిశెట్టి రాము, మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ అధ్యక్షులు చింతల నితిన్ గౌడ్, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు చిత్తరంజన్ దాస్ , సలహాదారులు శంకర్, జనరల్ సెక్రెటరీ విజయ్ కుమార్, శ్రీను, భాస్కర్, లక్ష్మీపతి , మరియు మహమ్మద్ , శృతిలయ అకాడమీ సభ్యులు అభినవ్ రెడ్డి, జంగయ్య , కవిత , శ్రీశైలం, కృష్ణ ,ఉదయ్, నర్సింగ్ ఆఫీసర్ రామాంజనేయులు, హరికృష్ణ,నాగర్ కర్నూల్ జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు పీకే గౌడ్, ఎన్ఎస్యూఐ ఫరీద్ , వడ్డేమోని శివకుమార్, శ్రీశైలం , మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

# నీటిపారుదల రంగం పటిష్టత పై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

-1323 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు
-గొల్లపల్లి రిజర్వాయర్,బుద్ధారం ఆన్లైన్ రిజర్వాయర్ల ఏర్పాటు, చెరువులు, చెక్ డ్యాములు, కెనాల్లా మరమ్మత్తుల పై దృష్టి సారించాలి
-నీటిపారుదల శాఖ అధికారుల రివ్యూ మీటింగ్ లో ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి,మే 8 (నీలగిరి ఎక్స ప్రెస్):** వనపర్తి నియోజకవర్గ పరిధిలో నీటిపారుదల రంగాన్ని పూర్తిస్థాయిలో పటిష్టపరిచేందుకు రూ. 1323 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఏర్పాటుచేసే రిజర్వాయర్లు, కాలువలు, లిఫ్టులతో పాటు అనేక మరమ్మత్తులను దృష్టిలో ఉంచుకొని రూ. 1323 కోట్ల రూపాయలకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశామని ఇందుకు సంబంధించిన నివేదికలను పూర్తిస్థాయిలో తయారు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు

గొల్లపల్లి రిజర్వాయర్ బుద్ధారం ఆన్లైన్ రిజర్వాయర్ కే ఎల్ ఐ డి5, డీ8 కాలువల పటిష్టత, విస్తరణ, స్ట్రక్చర్ల ఏర్పాటు,డిస్ట్రిబ్యూటరీ సిస్టం, బుద్ధారం కుడి, ఎడమ కాలువల పటిష్టత, గణపురం బ్రాంచ్ కెనాల్, కర్నే తండా లిఫ్ట్, కాశింనగర్ లిఫ్ట్ సంబంధించి పూర్తి వివరాలను సేకరించాలన్నారువేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ పరిధిలోని పలు చెరువులు కుంటలు చెక్ డ్యాముల నిర్మాణాలు మరమ్మత్తులను వెంటనే చెప్పటాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

## సైనికుల సాహసాన్ని తక్కువచేసే వ్యాఖ్యలు చేసిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్‌పై బీజేపీ ఫిర్యాదు



**కరీంనగర్, మే 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన 26 మంది సైనికుల త్యాగానికి ప్రతీకగా చేపట్టిన భారత సైన్యం 'ఆపరేషన్ సింధూర్' పై విమర్శలు చేసిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత పై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు దేశభక్తిని, సైనికుల వీరత్వాన్ని కించపరిచేలా ఉన్నాయని మండిపడి, ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇతర నేతలతో కలిసి గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను కలసి, ఈ మేరకు ఫిర్యాదు సమర్పించారు. "అర్బన్ నక్సలైట్లు దేశ సమగ్రతపై బహిరంగంగా దాడి చేస్తున్నారని" ఆయన ఆరోపించారు. సైనికుల మనోబలాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన సుజాతను తక్షణమే సస్పెండ్ చేయాలని, అలాగే ఆమెకు కల్పించిన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్ళపు రమేష్, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.

అన్నివేళలా మీతో పాటు ఉంటుంది

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

---

## ఉపాధ్యాయుల మెడికల్ బిల్లుల మంజూరులో జాప్యాన్ని నివారించాలి...

**టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్ విజ్ఞప్తి...**



**హైదరాబాద్, మే 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉపాధ్యాయుల మెడికల్ బిల్లుల మంజూరులో జాప్యాన్ని నివారించాలని అలాగే వరుస క్రమంలో బిల్లులు మంజూరు చేయాలని వైద్య విద్య సంచాలకుల కు టిపిటిఎఫ్ పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్ రిప్రజెంటేషన్ చేయడం జరిగింది. అలాగే జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజ్యలక్ష్మి తో మాట్లాడడం జరిగింది. వారు సానుకూలంగా స్పందిస్తూ స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగింది. ఈనెల ఏప్రిల్ వరకు వారి కార్యాలయానికి వచ్చిన అన్ని బిల్లులను ఈ వారం రోజులలో క్లియర్ చేసి డీఎస్సీకి పంపడానికి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. గురువారం వరకు పూర్తి అయిన దాదాపు 1200 బిల్లులను ఈరోజు సాయంత్రానికి డీఎస్సీ కార్యాలయానికి చేరవేసే విధంగా చర్యలు తీసుకోవడానికి కూడా వైద్య విద్య సంచాలకులు హామీ ఇవ్వడం జరిగిందని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్ తెలిపారు.

---

## గుర్రం పల్లి గ్రామంలో జై బాపు,జై భీం,జై సంవిధాన్ యాత్ర పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**చౌదరిగూడ, మే 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చౌదరిగూడ మండలంలోని గుర్రం పల్లి గ్రామంలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గుర్రంపల్లి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు.అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..నేడు రాజ్యాంగ సంస్థలను, రాజ్యాంగంను నిర్వీర్యం చేసే ఏ శక్తినైనా అడ్డుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రాజ్యాంగం రచించి అట్టడుగు వర్గాల వారికి స్వేచ, సమానత్వం కల్పించారని అన్నారు. గాంధీ,అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి అందరిని జాగృతం చేయాల్సిన అవశ్యకత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, కొందుర్గ్ మండల అధ్యక్షుడు కృష్ణా రెడ్డి,నందిగామ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు,మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, అగ్గనూరు విశ్వం, కొంకళ్ళ చెన్నయ్య, పురుషోత్తం రెడ్డి,జితేందర్ రెడ్డి,రోహిత్ రెడ్డి,కొమ్ము కృష్ణ,అందే మోహన్, ముబారక్ అలీ ఖాన్ , సీతారాం,తుపాకుల శేఖర్,మాజీ సర్పంచులు నర్సప్ప గూడ కృష్ణ, నర్సింహులు,స్థానిక నాయకులు ఆంజనేయులు,బుచయ్య, గోపాల్,మల్లేష్,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

---

# శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాతపై చర్యలు తీసుకోవాలి

- బిజెపి మహిళా మోర్చా ఆందోళన ...
-దిష్టిబొమ్మ దహనం...
-'ఆపరేషన్ సింధూర్" పై ప్రొఫెసర్ సుజాత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. .
-భారత ఆర్మీ పోరాటాన్ని కించపరిచేలా , ఎగతాళి చేసేలా ప్రొఫెసర్ సుజాత వ్యాఖ్యలు ఉన్నాయి..
-ప్రొఫెసర్ సుజాతను సస్పెండ్ చేయాలి..
-బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయ శ్రీ



**కరీంనగర్,మే 8( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశ ప్రజల మనోభావాలు దెబ్బ తినే విధంగా, సైనికుల సాహసాన్ని కించపరిచేలా , ఎగతాళి చేస్తూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం రోజున బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో యూనివర్సిటీ వద్ద నిరసన ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళ మోర్ఛ జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ పెహల్గాంలో పాకిస్తాన్ ముష్కరులు ఒడిగొట్టిన దారుణానికి ప్రతీకారంగా "ఆపరేషన్ సింధూర్" పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యను యావత్ దేశ ప్రజలు హర్షిస్తుంటే, బాధ్యతయుత హెూదాలో శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ , రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు సూరేపల్లి సుజాత సోషల్ మీడియా వేదిక అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ తోపాటు పాకిస్తాన్ భూభాగంలలోని లష్కరే తోయిబా, జేషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థల శిబిరాలను ధ్వంసం చేసి ఉగ్రవాదులను హతమార్చిన ఈ ఘటనను శ్లాషిస్తు, . భారత సైనికుల సాహసాలను, త్యాగాలను స్మరించుకుంటున్నరని తెలిపారు. ప్రపంచదేశాలు సైతం ఉగ్రవాద నిర్మూలన విషయంలో భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంఘీభావం ప్రకటిస్తున్నాయన్నారు. ఇలాంటి సమయంలోశాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత మాత్రం అందుకు భిన్నంగా సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్స్ దేశ సైనిక చర్యను అవమానించేలా ఉన్నాయన్నారు.. ఇవి ముమ్మాటికీ సైనికుల పోరాటాలను కించపరచడమేన న్నారు. ఉన్నతమైన ఉద్యోగంలో ఉంటూ ఆమె చేసిన పోస్టింగ్స్ ముమ్మాటికీ దేశద్రోహ చర్యలుగానే భావిస్తున్నామన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సైతం కేంద్రం తీసుకుంటున్న చర్యలకు మద్దతు పలుకుతూ సైనికులకు సంఘీభావం తెలుపుతూ కార్యక్రమాలు చేపడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ అడ్వైజరి కమిటీ సభ్యురాలుగానూ కొనసాగుతున్న సూరెపల్లి సుజాత మాత్రం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సహించరాని విషయం అని పేర్కొన్నారు. గతంలోనూ సూరెపల్లి సూజాత నక్సల్స్ భావజాలానికి అనుకూలంగా మాట్లాడారనీ, . వివిధ సామాజిక మాధ్యమాల్లో ఆమె చేసిన పోస్టింగులు వివాదాస్పదమయ్యాయనే విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు .బాధ్యతాయుతమైన ప్రొఫెసర్ గా ఉంటూ సమాజానికి, విద్యార్థి లోకానికి ఆదర్శంగా ఉండాల్సిన సుజాత సమాజాన్ని తప్పుదోవపట్టించేలా, రెచ్చగొట్టేలా వ్యవహరించడమే కాకుండా తాజాగా సైనికుల వీరోచిత పోరాటాలను కించపర్చేలా వ్యవహరించిన నేపథ్యంలో ప్రొఫెసర్ సుజాత పై పై చట్టపరంగా చర్యలుతీసుకొని, సస్పెండ్ చేయాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

---

# స్వర్గీయ శ్రీమతి గంజి అమృతకి నివాళులు



**ఖైరతబాద్, మే8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖైరతాబాద్ లోని వాసవి సేవా కేంద్రంలో శ్రీమతి గంజి అమృత శ్రద్ధాంజలి, నివాళులు ఎంతో ఘనంగా నిర్వహించిన తరంతరం,వారి భర్త అయిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ అడ్వైజరీ బోర్డ్ కమిటీ చైర్మన్, ప్రజారత్న, వైశ్యరత్న, దానకర్ణ శ్రీ గంజి రాజమౌళి గుప్తా ని పలకరించి వారి జ్ఞాపకార్థం ఫోటో చిత్రంలో పాల్గొన్న ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ శాఖ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు,ప్రచార కమిటీ కోవైస్ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా,వేములవాడ అన్న సత్రం అధ్యక్షుడు శ్రీ బుస్సా శ్రీనివాస్,తెలంగాణ అవోపా అధ్యక్షుడు శ్రీ మలిపెద్ది శంకర్,నల్లకుంట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీ ఎర్రం శ్రీనివాస్ గుప్తా ,ఐవీఎఫ్ సీనియర్ అధ్యక్షుడు శ్రీ కాచం కృష్ణమూర్తి. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు వాసవి ఆర్ట్ థియేటర్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ పాల్గొన్నారు.

---

# మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి ఆకస్మిక మృతి

**సంతాపం తెలిపిన రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర...**

**ఉప్పల్, మే 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్న మాజీ శాసనసభ్యుడు రాజిరెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యేగా నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తన సంతాప సందేశంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. రాజిరెడ్డి మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఎంపీ రవిచంద్ర భగవంతున్ని ప్రార్థించారు.

---

# భారత సైన్యానికి సెల్యూట్..

**-ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**




**పరిగి మే 08: మే 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
**పరిగి**పట్టణంలోని కొడంగల్ చౌరస్తాలో పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు.పాకిస్తాన్ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్'ద్వారా ఉగ్రవాదులను అంతమొందించడం గర్వంగా ఉందని,వ్యూహాత్మకంగా మెరుపుదాడులతో పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేయడంపై ఇండియన్ ఆర్మీ,ఎయిర్‌ఫోర్స్,నేవీ బలగాలను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అభినందించారు.భారతదేశ పౌరులను,ఎల్లవేళలా దేశాన్ని కాపాడుతున్న ఇండియన్ ఆర్మీ సేవలను ఎప్పటికీ కూడా మర్చిపోలేము అని భారతదేశ చరిత్రలో ఇండియన్ ఆర్మీ పోరాటం లిఖించబడుతుందని అన్నారు.తను కూడా ఒక ఆర్మీ కుటుంబం నుంచి వచ్చానని,దేశభద్రత విషయంలో పార్టీలకు అతీతంగా మద్దతు చేస్తామని రాజకీయాలను పక్కనపెట్టి దేశ రక్షణ మొదటి ప్రాధాన్యతగా భావిస్తున్నామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికి అయినా మద్దతు పలుకుతామని తెలిపారు.

---

# 150 కోట్ల రూపాయలతో జంగంరెడ్డిపల్లి ఎత్తిపోతుల పథకానికి శ్రీకారం

**ఎన్నికల హామీలు నెరవేర్చుతున్న మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి**



**మక్తల్: మే 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మక్తల్ నియోజకవర్గ శాసనసభ ఎన్నికల సమయంలో నర్వ మండలంలోని రైతుల చిరకాల స్వప్నమైన జంగంరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి మక్తల్ శాసనసభ్యులు గౌరవ డాక్టర్ వాకిటి శ్రీహరి గారి నేతృత్వంలో నెరవేరాబోతున్న నర్వ మండల రైతుల సాగునీటి కష్టాలు జంగం రెడ్డిపల్లి ,పాతర్చేడ్ ,ఉందే కోడు ,బుడ్డగానితాండ, గాజులయ్యతండా ,కన్మనూర్, ఇతర గ్రామాల రైతులకు ఈ లిఫ్ట్ ద్వారా సాగునీరు అందివ్వడానికి భారీ నీటి పారుదల శాఖ గౌరవ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి గారి చొరవతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారి కృషితో మక్తల్ మండలంలోని భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నర్వ మండలంలోని జంగంరెడ్డిపల్లి వరకు భూ సర్వే పనులు ప్రారంభమయ్యాయి గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో బూటకపు హామీలిచ్చి పది సంవత్సరాలు కాలయాపన చేసి పట్టించుకోవడం మర్చిపోయారు కానీ నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రైతు లేనిదే రాజ్యం లేదు అనే నినాదంతో రైతుల పంట పొలాలు సస్యశ్యామలం చేసే లక్ష్యంతో ఈ జంగంరెడ్డిపల్లి లిఫ్ట్ సర్వే పనులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గారు ప్రారంభించారు ఈ లిఫ్ట్ అందుబాటులోకి వస్తే దాదాపు మండలంలోని 7000 నుంచి 10000 ఎకరాలకు సాగునీరు అందుతుంది లిఫ్ట్ పనులు ప్రారంభించినందుకు మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవ డాక్టర్ వాకిటి శ్రీహరి గారికి నర్వ మండల కాంగ్రెస్ నాయకులు ,రైతులు ,ప్రజలు రుణపడి ఉంటామని వర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదములు తెలియజేశారు

---

# ఉగ్రవాద స్థావరాలను నేల మట్టం చేయాలి



**హైదరాబాద్, మే 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయాలి, ఉగ్రవాదులను తుద ముట్టించాలి. అమాయకులైన పర్యాటకులను అమానుషంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల శిబిరాలపై మన రక్షణ దళాలు చేపట్టిన చర్యలకు సెల్యూట్ ఆపరేషన్ సింధూర్ పేరుతో చేపట్టిన ముష్కరుల నిర్మూలన చర్యలు దిగ్విజయంగా ముగియాలి. రాజకీయాలకు అతీతంగా యావత్ దేశమంతా రక్షణ దళాలకు సంపూర్ణ మద్దతుగా నిలుస్తుంది అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు.

# పాకిస్తాన్ జాతీయులను మదర్సాల్లో నివసించే వారిని వివరాలు సేకరించి బహిష్కరించడానికి తక్షణమే చర్యలు చేపట్టండి

**-తిమ్మాపూర్ బిజెపి అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి డిమాండ్**




**తిమ్మాపూర్,మే 8( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
పహల్గం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించడానికి తక్షణం చేపట్టాలని , ఆ దిశగా జాబితా చేసి వారిపై చర్యలు తీసుకోవాలని , అలాగే తిమ్మాపూర్ మండలం లోని వివిధ గ్రామాల్లో ఉన్నటువంటి మదర్సాలాల్లో నివసించే ఇతర రాష్టాలకు చెందిన వారి యొక్క పూర్తి వివరాల ను సేకరించేలా చర్యలు తీసుకోవాలని తిమ్మాపూర్ మండ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరచారి తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి కి గురువారం వినతపత్రం సమర్పించారు.బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తలు తహసీల్దార్ ను కలిసారు. ఇటీవల కాశ్మీర్ లోని పహాల్గం జరిగిన ఉగ్రవాదుల దాడుల తర్వాత కేంద్ర ప్రభుత్వం ఉగ్ర మూకలను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ పై అనేక చర్యలు చేపట్టిందన్నారు. అలాగే దేశంలో ఉన్న పాకిస్తానీలను గడువులోగా వెళ్ళిపోవాలని తెలియజేసిన కొంతమంది ఇక్కడే నివసిస్తున్నారని తెలిపారు. అలాంటి వారందరినీ గుర్తించి , జాబితా చేసి తక్షణం దేశం నుండి పంపించడానికి చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, మండలాల్లో, గ్రామాల్లో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి పంపించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు . అలాగే మదర్సాలలో వందల మంది నివాసం ఉంటున్నట్లు ఇంటలిజెన్స్ నివేదిక ఉన్న నేపథ్యం లో కరీంనగర్ కు దగ్గరగా హైవే కు ఆనుకొని ఉన్నటువంటి మండలం అయినందున అనుమానితుల కదలికలపై నిఘా ఉంచేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు వినతిపత్రం లో కోరారు. వివిధ గ్రామాల్లో గత ఇరవై ఏళ్ల క్రితం నుండి ఏర్పాటు చేసిన మదరసాల లో నివసించే తెలంగాణే తరుల వివరాలను సేకరించాలని కోరారు.భారత ప్రభుత్వం తో పాటుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తింపు లేకుండా నివసించే తెలంగాణేతరులను వెంటనే వారి ప్రాంతాలకు పంపించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన క్రమంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు వినతిపత్రం లో పేర్కొన్నారు. అనంతరం నూతనంగా తిమ్మాపూర్ భాద్యతలు తీసుకున్న తహసీల్దార్ ను శాలువాతో సన్మానం చేసారు. జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, మల్లారెడ్డి,వేల్పుల ఓదయ్య,దుర్గుంటి శేఖర్ రెడ్డి, శాబోలు గణేష్,వేల్పుల అరవింద్ తదితరులు తహసీల్దార్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.
**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.
చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

## ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు నేడు ఆఖరి రోజు



**వెల్దండ, మే 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ పట్టణ పరిధిలోని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాల గడువు నేడు ముగుస్తుంది అని ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులుదరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రవేశానికి సంబంధించి అర్హతలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం వంటి వివరాలను పాఠశాల అధికారిక వెబ్‌సైట్ లేదా సంబంధిత విద్యా శాఖ కార్యాలయం ద్వారా తెలుసుకోవచ్చు అని అధికారులు పేర్కొన్నారు.

## రెడ్ క్రాస్ ఆవిర్భా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపించేసిన కోట్ల గౌతం



**దేవరకొండ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్):**
నల్లగొండ జిల్లా దిండి మండల పరిధిలోని, ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన,రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవం మే 8 సందర్భంగా దిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది . ఈ సందర్భంగా రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు కోట్ల గౌతం మాట్లాడుతూ రెడ్ క్రాస్ ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు స్వచ్ఛందంగా ప్రజలకు, ప్రపంచంలో ఎక్కడ అత్యవసర పరిస్థితులు ఏర్పడిన, అక్కడ రెడ్ క్రాస్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యను పరిష్కరించిన మెకానిక్ దండు రాము

**మక్తల్:మే 8(నీలగిరి ఎక్స ప్రెస్):**
మక్తల్ మున్సిపాలిటీ పట్టణంలోని 2 వా వార్డ్ లో అసలే మండుటెండలు త్రాగునీటి మోటర్ మోరాయించడం ద్వారా తాగునీటి సమస్య తలెత్తింది ఇట్టి సమస్యను కాలనీవాసులు మెకానిక్ దండు రాములు దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే మోటర్ బాగు చేయించడం జరిగింది వార్డులోనే ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందించి మీ సమస్యలు తీరుస్తానని వారికి హామీ ఇవ్వడం జరిగింది మెకానిక్ దండు రాము వెంటనే స్పందించి మోటర్ సమస్యను పరిష్కరించినందుకు కాలనీవాసులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు .

## రాజీవ్ యువ వికాసము ఇంటర్వ్యూలు నిర్వహించిన ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు



**ఉర్కొండ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్):**
ఊర్కొండ మండల పరిధిలోని, మాదారం గ్రామపంచాయతీ, కార్యాలయంలో రాజీవ్ వికాసం లబ్ధిదారులు ఎంపిక కొరకు, మండల స్కీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో, ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. ఈ ఇంటర్వ్యూలకు మాదారం,గుడిగంపల్లి, రాచాలపల్లి, తిమ్మన్నపల్లి, గ్రామాల నుండి 175 దరఖాస్తు దారులు హాజరు కావడం జరిగింది. ఇంటర్వ్యూ నిర్వహించిన వారిలో, మండల ప్రత్యేక అధికారి, ఎం శ్రీనివాసులు ఎంపీడీవో ఈ కృష్ణయ్య యూకో బ్యాంక్ మేనేజర్ హరిచంద్ర ప్రసాద్, లక్ష్మణ్ ఏపిఓ సంతోష్ ఏపిఎం ,బీసీ కార్పొరేషన్ బాధ్యులు, రామకృష్ణ, మరియు వెంకటేష్, రవికుమార్, ఖాజా, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, మరియు పంచాయతీ కార్యదర్శి రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక పనులను పరిశీలించిన మాజీ ఎంపిటిసి కోళ్ల వెంకటేష్



**మక్తల్: మే 8(నీలగిరి ఎక్స ప్రెస్):**
మక్తల్ మున్సిపాలిటీ పెద్ద చెరువు స్మశాన వాటిక అభివృద్ధి పనుల కోసం తన సొంత నిధులు విరాళం ఇచ్చిన( డి డి ఎల్) చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శరత్ బాబు గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు మన మక్తల్ లో ఇంకా ఎన్నో పనులు చేయాలని వారికి వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుని ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటూ గురువారం స్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటిసి కోళ్ల వెంకటేష్ గారు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్స్ ఎం శ్రీనివాస్ ,పసుల రంజిత్ రెడ్డి, నాయకులు ఆంజనేయులు ,వాకిటి శ్యామ్, మామిళ్ళ కిష్టప్ప ,నాగులు, అంజి ,తదితరులు కలిసి జరుగుతున్న పనులను పరిశీలించడం జరిగింది

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ

**జిల్లా వ్యవసాయ అధికారి పి శ్రవణ్ కుమార్**

**నాంపల్లి మే 8(నీలగిరి ఎక్స ప్రెస్):**
నాంపల్లి మండల కేంద్రంలోని పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రావణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించి, తేమ శాతం 17, తాలు 3, శాతం కన్నా ఎక్కువగా లేని వడ్లను మాత్రమే కొనుగోలు చేయాల్సిందిగా వ్యవసాయ విస్తరణ అధికారులకు మార్కెట్ సిబ్బందికి సూచించడం జరిగింది.క్షేత్రస్థాయిలో వున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు.

## ఆపరేషన్ సిందూర్ విజయంతో భారీ ర్యాలీ నిర్వహించిన తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక




**కడ్తాల్, మే 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాశ్మీర్ పహాల్గంలో ఉగ్రవాదుల దాడికి ప్రతీకగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ తో పాటు పాక్ లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ సిందూర్ నిర్వహించి ఉగ్ర శిబిరాలను సర్వనాశనం చేసిందని ఈ సక్సెస్ భారత సైన్యానికి అంకితమని, శ్రీశైలం రహదారిపై భారీ నిర్వహించిన తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు, జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ ఈ కార్యక్రమం లో గ్రామపెద్దలు లాయక్ అలీ, యువనాయకుడు కొప్పు కృష్ణ, కావలి కుమార్, దుడ్డు నాగరాజు, కంటేకర్ వెంకటేష్, మహేష్, వంపుగూడెం రమేష్ యువజన సంఘం సభ్యులు, నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై భారత సైన్యం ప్రతీకార దాడులు హర్షణీయం

**– మాజీ సైనికుడు పోలే శ్రీనివాస్, యువనాయకుడు సురేష్**

**తలకొండపల్లి, మే 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్' దేశ నైతిక సాహసాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని మాజీ సైనికుడు పోలే శ్రీనివాస్, తలకొండపల్లి యువనాయకుడు సురేష్ పేర్కొన్నారు. "25 నిమిషాల్లో 9 ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేస్తూ దాదాపు 80 మంది ఉగ్రవాదులను మట్టుపెట్టిన సైనికుల ధైర్యం హృదయాన్ని హత్తుకుంది" అని వారు అన్నారు. ఈ దాడుల్లో మాక్ డ్రిల్, యుద్ధసన్నాహాల్లో సాధన చేసే వ్యూహాలు ఎంతగానో ఉపయోగపడాయని వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడికి భారత సైన్యం చూపిన ఈ సమర్ధ ప్రతిచర్య, దేశ ప్రజల్లో నైతిక ధైర్యాన్ని బలపరిచిందన్నారు. కేవలం ఉగ్రవాద శిబిరాలనే లక్ష్యంగా చేసుకొని, అమాయక పౌరులకు ఎలాంటి హాని కలగకుండా దాడులు నిర్వహించిన విధానం ద్వారా భారత సైన్యం తన నైతిక విలువలు, విశ్వవిస్తృతత నిరూపించుకుందని వారు ప్రశంసించారు. ఉగ్రవాదంపై పోరాటంలో న్యాయబద్ధ మార్గాలను అనుసరిస్తూ భారత సైన్యం చూపిన నైపుణ్యం, నియంత్రణ ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం, సైన్యం నిర్దిష్ట ధైర్యానికి హ్యాట్సాఫ్ చెబుతూ, వీరు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఉగ్రవాద సంస్థలపై దాడిచేసే హక్కు భారత్‌కు ఉంది..

యూకే పార్లమెంట్‌లో ఎంపీ ప్రీతి పటేల్ స్పీచ్



న్యూఢిల్లీ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): పహల్గాం లో కాల్పులకు తెగబడి అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాద సంస్థలపై దాడిచేసే హక్కు భారత్‌కు పూర్తిగా ఉందని బ్రిటన్ ఎంపీ ప్రీతి పటేల్ అన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంట్‌లో భారత్‌కు మద్దతుగా ఎంపీ ప్రీతి తన గళం వినిపించారు. ఆపరేషన్ సిందూర్ ను సమర్థించారు.ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ బుధవారం తెల్లవారుజామున మెరుపు దాడులు చేసింది. ఈ దాడులపై ఎంపీ ప్రీతి పటేల్ అక్కడి హౌస్ ఆఫ్ కామన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పహల్గాం బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదుల చర్య కారణంగా భారత్‌లో ఇప్పటికే ముంబై, ఢిల్లీ దెబ్బతిన్నాయని, ఇప్పుడు ఆ జాబితాలో పహల్గాం చేరిందని అన్నారు. 'పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులను అన్యాయంగా, క్రూరంగా చంపేశారు. ఈ దాడిలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఇది ఉగ్రవాద చర్య. భారత్‌లో ఉగ్రవాద చర్యల కారణంగా దెబ్బతిన్న ముంబై, న్యూఢిల్లీల జాబితాలో ఇప్పుడు పహల్గాం కూడా చేరింది. ఆత్మరక్షణ కోసం పోరాడే హక్కు భారత్‌కు ఉంది. అమాయకుల ప్రాణాలు పోవడానికి కారణమైన పాకిస్థాన్ లోని ఉగ్రవాదుల స్థావరాలనే భారత్ లక్ష్యంగా చేసుకుంది. యూకే, భారత్‌ల మధ్య దీర్ఘకాలిక భద్రతా సహకార ఒప్పందాలు ఉన్నాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారత్‌కు బ్రిటన్ ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలి' అని ఆమె పిలుపునిచ్చారు. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబా భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద చర్యలకు పాల్పడినట్లు చరిత్ర స్పష్టం చేస్తోందని ప్రీతి పటేల్ అన్నారు. ఆ ఉగ్రవాద సంస్థకు హమాస్‌తో సంబంధాలు ఉన్నాయని ఇటీవల నివేదికలు వెలువడినట్లు తెలిపారు. యూకే, దాని మిత్రదేశాల ప్రయోజనాలకు ముప్పు కలిగించేలా ఏ ఉగ్రవాద సంస్థలు ప్రస్తుతం పాకిస్థాన్‌లో చురుకుగా ఉన్నాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గించండి..

పాకిస్థాన్‌కు అమెరికా పిలుపు



న్యూఢిల్లీ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ప్రయత్నాలు మొదలుపెట్టారు. భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాకిస్థాన్ ప్రధాన మంత్రి మహమ్మద్ షెహబాజ్ షరీఫ్‌తో విడివిడిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ దుశ్చర్యను మార్కో రూబియోకు జైశంకర్ వివరించారు. సరిహద్దుల్లో తక్షణమే ఉద్రిక్తతలను తగ్గించాలని పాకిస్థాన్ ప్రధానికి ఆయన సూచించారు. ఇరు దేశాల మధ్య చర్చలకు మద్దతిస్తామని ఆయన తెలిపారు.రూబియోతో ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని జైశంకర్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌తో కలిసి పనిచేయడంలో అమెరికా నిబద్ధతను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. సరిహద్దు ఉగ్రవాదాన్ని వ్యతిరేకంగా పోరాటమే లక్ష్యంగా చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన నొక్కిచెప్పారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెంచే ఏ ప్రయత్నాన్ని అయినా ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. అలాగే యూరోపియన్ యూనియన్(ఈయూ) ఉపాధ్యక్షుడు కజాకల్లాస్, ఇటలీ ఉపప్రధాని, విదేశాంగ మంత్రి సైతం జైశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్ పాకిస్థాన్ మధ్య ప్రస్తుత పరిస్థితుల్ని జైశంకర్ వివరించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్లు వారికి తెలిపారు. ఉద్రిక్తతలకు పాల్పడితే తీవ్రంగా ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు.

## కేరళలో నిపా వైరస్ కేసు..

మహిళకు సోకినట్లు నిర్ధారణ




తిరువనంతపురం మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): కేరళలో నిపా వైరస్ కేసు వెలుగులోకి వచ్చింది. ఒక మహిళకు ఈ వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఆమె చికిత్స పొందుతున్నదని ఆ రాష్ట్ర ఆరోగ్య అధికారులు తెలిపారు. మలప్పురం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వాలంచెరికి చెందిన ఒక మహిళకు నిపా వైరస్ ఇన్ఫెక్షన్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ ఈ విషయం తెలిపారు. పెరింతలమన్నలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.కాగా, ఆ మహిళ గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నదని ఆరోగ్య అధికారులు తెలిపారు. దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించాయని చెప్పారు. నిపా ఇన్ఫెక్షన్‌గా అనుమానించి నమూనాలను సేకరించినట్లు తెలిపారు. పూణేలోని వైరాలజీ ప్రయోగశాలకు పంపినట్లు వివరించారు. దీంతో నిపా ఇన్ఫెక్షన్ కేసుగా నిర్ధారణ అయ్యిందని ఆరోగ్య అధికారులు వెల్లడించారు.

## ఆపరేషన్ సిందూర్ అద్భుతం

ఆర్మీకి మంత్రి ఉత్తమ్ అభినందనలు



సూర్యాపేట, మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): జమ్మూకశ్మీర్‌లో ఇటీవల భారత పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రమూకలు దాడులకు భారీత్ ప్రతీకారం తీర్చుకోవడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమర్థించారు. మాజీ సైనికుడిగా భారత్ సైన్యానికి మంత్రి ఉత్తమ్ శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భారత బలగాలపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్‌పై స్పందించారు. భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడులు విజయవంతంగా పూర్తి చేసిందని అన్నారు. భారత సైన్యం సమర్ధవంతంగా శత్రువుల మీద దాడి చేసి భారత సైన్య లక్ష్యాలను పూర్తి చేసి పాకిస్తాన్‌కి సరైన గుణపాఠం చెప్పిందని అన్నారు. గురువారంకోదాడ పట్టణంలో వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ-హాస్పిటల్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పట్టణంలో మెరుగైన వైద్యం సేవలు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అవడంతో ర్యాలీ నిర్వహించాలని భారత సైన్యానికి సంఘీభావంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు.

## భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో అనుమానాస్పద డ్రోన్ సంచారం



గౌహతి మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో అనుమానాస్పద డ్రోన్ సంచరించింది. చైనా తయారీ డ్రోన్ కలకలం రేపింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. ఆ డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దు దాటి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. అస్సాంలోని శ్రీభూమి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం సాయంత్రం భారత్, బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని చోరాకురి ప్రాంతంలో అనుమానాస్పద డ్రోన్ సంచరించింది. ఒక ఇంటి పైభాగంలో ఎగురుతున్న నల్ల రంగు డ్రోన్‌ను గుర్తించిన స్థానికులు ఆందోళన చెందారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు.కాగా, పోలీసులు వెంటనే స్పందించారు. అక్కడకు చేరుకుని ఆ డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మేడ్ ఇన్ చైనా అని డ్రోన్‌పై ఉన్నట్లు గుర్తించారు. దేశ సరిహద్దు దాటి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న చైనా డ్రోన్‌ను విశ్లేషిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన తరుణంలో ఈ సంఘటన జరుగడం కలకలం రేపింది.

## భారత్ దెబ్బ..

జైషే చీఫ్ సోదరుడు, ఐసీ-814 హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ మృతి



న్యూఢిల్లీ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది దేశం పాక్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా చేపట్టిన ఈ దాడులతో జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ చీఫ్ మౌలానా మసూద్ అజార్ కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇప్పటికే అజార్ కుటుంబం మొత్తం హతమైన విషయం తెలిసిందే. తాజాగా ఆయన సోదరుడు, ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్ సైతం ప్రాణాలు కోల్పోయారు.భారత్ దాడుల్లో బహవల్‌పూర్ లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో 10 మంది మసూద్ కుటుంబ సభ్యులు, నలుగురు సహాయకులు ప్రాణాలు కోల్పోయారు. జైషే చీఫ్ ప్రాణాలతోనే ఉన్నట్లు తెలిసింది. భారత్ జరిపిన దాడిలో తన కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయినట్లు మసూదే స్వయంగా వెల్లడించారు. తాజాగా అతడి సోదరుడు రవూఫ్ అస్గర్ కూడా మరణించారు. రవూఫ్ అస్గర్ పలు ఉగ్రదాడుల్లో కీలక నిందితుడు. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్ సూత్రధారి. అతడి మాస్టర్‌మైండ్స్‌తో ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాందహార్‌కు తరలించారు. అనంతరం భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. ఇక్కడి జైళ్లలో ఉన్న ఉగ్రనాయకులు మసూద్ అజహర్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్‌ను విడిపించుకొని తీసుకెళ్లారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్టు డేనియల్ పెర్ల్ హత్యలో కూడా ఇతడి పాత్ర ఉంది. అంతేకాదు భారత్‌లో జరిగిన పలు ఉగ్రదాడుల వెనుక ఇతడి హస్తం ఉంది. 2001లో జరిగిన పార్లమెంట్‌పై దాడి, 2016లో పఠాన్ కోట్ దాడి, 2019లో పుల్వామా వంటి ఉగ్ర ఘటనల్లో రవూఫ్ ప్రమేయం ఉంది.

## మూడు పాక్ ఫైటర్ జెట్లను కూల్చివేసిన భారత సైన్యం!



న్యూఢిల్లీ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గురువారం రాత్రి సత్వారీ, సాంబా, ఆర్ఎస్ పురా, ఆర్నియా సెక్టార్లలో పాక్ క్షిపణి దాడులకు ప్రయోగించింది. అయితే పాక్ దాడులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. పాకిస్థాన్ ప్రయోగించిన ఎనిమిది మిస్సైల్స్‌ను విరోచితంగా కూల్చివేసింది. అలాగే రాజస్థాన్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని కూడా కూల్చివేసినట్లు తెలుస్తోంది. వీటితో పాటు రెండు జేఎఫ్17 యుద్ధ విమానాలను సైతం కూల్చివేసిందని సమాచారం.ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలను సైరన్లతో భారత సైన్యం అప్రమత్తం చేసింది. ప్రజలంతా తమ నివాసాల్లోనే ఉండాలని భారత సైన్యం హెచ్చరించింది. అఖ్నూర్, కిశ్వార్, సాంబా సెక్టార్లలో అధికారులు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలివేశారు. అలాగే ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. బ్లాక్ అవుట్ పాటిస్తున్నారు.

## జై శంకర్‌తో సౌదీ,ఇరాన్ మంత్రుల భేటీ



న్యూఢిల్లీ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన గంటల వ్యవధిలోనే సౌదీ అరేబియా, ఇరాన్ మంత్రులు ఢిల్లీకి రావడం, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం రాత్రే ఢిల్లీ చేరుకున్న సౌదీ అరేబియా విదేశాంగ శాఖ సహాయ మంత్రి అదెల్-జుబేదర్ గురువారం ఉదయం జైశంకర్‌తో భేటీయ్యారు. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ దృక్కోణాన్ని జుబేదర్‌కు వివరించినట్లు జైశంకర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి కూడా జైశంకర్‌తో గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు సమావేశమయ్యారు.

## ఇండియన్ ఆర్మీకి చిక్కిన పాకిస్థాన్ పైలట్!

న్యూఢిల్లీ మే 8(నీలగిరి ఎక్స ప్రెస్): ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో దాడులకు దిగిన పాకిస్థాన్‌కు ఇండియన్ ఆర్మీ ధీటుగా బదులిస్తోంది. పాకిస్థాన్ ప్రయోగించిన ఎనిమిది డ్రోన్లు, మిస్సైల్స్‌ను కూల్చివేసింది. అలాగే పఠాన్‌కోట్ సెక్టార్‌లో పాకిస్థాన్‌కు చెందిన మూడు ఫైటర్ జెట్లను కూల్చివేసింది. వీటిలో ఎఫ్ 16, రెండు జేఎఫ్-17 యుద్ధ విమానాలు ఉన్నాయి. వీటిలో ఎఫ్ 16లో ఉన్న పాకిస్థాన్ పైలట్‌ను భారత సైన్యం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే జలంధర్‌లో పాక్ డ్రోన్లను భారత రక్షణ వ్యవస్థను సమర్థవంతంగా అడ్డుకుంది.కాగా, పాకిస్థాన్ దాడులను భారత రక్షణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. జమ్మూ, పఠాన్‌కోట్, ఉధమ్‌పూర్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు పాల్పడిందని వెల్లడించింది. డ్రోన్లు, మిస్సైల్‌తో ఈ దాడులకు తెగబడిందని చెప్పింది. మార్గదర్శకాల ప్రకారం ధీటుగా తిప్పికొడుతున్నామని స్పష్టం చేసింది. ఈ దాడుల్లో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని స్పష్టం చేసింది. దేశ ప్రజల రక్షణ, సమగ్రతను కాపాడేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు వెల్లడించింది.